బాబు హయాంలో లోకేష్‌కే జాబు



వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: బాబు హయాంలో లోకేష్‌కు ఎమ్మెల్సీతోపాటు మంత్రి పదవి లభించిందని... అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే 4 లక్షల మందికి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో భీమిలి జోన్‌లోని నాలుగు వార్డుల వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను బుధవారం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని, వారికి సీఎం జగన్ భవిష్యత్తులో తప్పకుండా మేలు చేస్తారన్నారు. భీమిన్ జోన్‌లో రూ.900 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ఇలాంటి వ్యవస్థ కలిగి ఉండటం మన రాష్ట్రానికి గర్వకారణమన్నారు. అంబేడ్కర్, గాంధీజీ ఆశయాలు నెరవేరుస్తున్న మన సీఎం జగన్ ప్రధాని మోదీ మన్ననలు పొందడమే కాకుండా మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శనీయునిగా నిలిచారన్నారు.

ప్రతిపక్షాలన్నీ వచ్చినా జగన్ ఒక్కరే..

2024 ఎన్నికల్లో ప్రతిపక్షాల నాయకులు వంద మంది కలిసి వచ్చినా సీఎం జగన్ ఒక్కరే ఎదుర్కొంటారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకుండా ఇంకెవ్వరూ సీఎం కాలేరన్నారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్నందుకు ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు.

కార్యక్రమంలో జెడ్పీ బి.రాము, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు, 1, 2, 3 వార్డుల అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు తమ్మిన రామలక్ష్మణ, బి.రాములప్పడు, సీనియర్ నాయకులు జీరు వెంకటరెడ్డి, జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, జీరు సుజాత, చిప్పాడ వెంకటేష్, వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాలకృష్ణమూర్తి రాజుపై చర్యలకు వినతి



వైవీ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న పద్మనాభం మండల వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కించపరుస్తూ వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న మాజీ ఎంపీపీ దంతులూరి గోపాలకృష్ణమూర్తి రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పద్మనాభం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి విశాఖ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తదితరులు ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఉన్నారు. కొత్త కొవ్వాడకు చెందిన గోపాలకృష్ణమూర్తి పదేళ్లుగా వేరే రాష్ట్రంలో ఉంటూ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో ఎప్పుడూ పాల్గొనలేదన్నారు. 2014కు ముందు జరిగిన స్థానిక ఎన్నికలు, సహకార సంఘాల ఎన్నికలతోపాటు ఇటీవల జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఓడించడానికే పనిచేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. 2014, 2019 సాధారణ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారన్నారు. గత మూడు నెలలుగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై వ్యక్తిగత విమర్శలు పెంచుతూ హేళనగా మాట్లాడుతున్నారన్నారు.

ఈ నెల 12న మండలంలో జరిగిన పార్టీ సమావేశంలో గోపాలకృష్ణమూర్తి రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పార్టీ తీర్మానం చేసినందున ఈ ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇనాం రైతులతో ఎంపీ జీవీఎల్ సమావేశం



నారాయణరాజుపేటలో ఇనాం రైతులతో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట ఇనాం భూముల సమస్యలకు సంబంధించి ఎంపీ జీవీఎల్ నరసింహారావు బుధవారం అక్కడి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు సూరిబాబు, చిన్నయ్య, వెంకటరమణ తదితర 300 మంది ఆయనతో మాట్లాడారు. 80 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను పెదబాబు అనే వ్యక్తి రికార్డులు మార్చి రూ.14 కోట్లకు విక్రయించారని ఆరోపించారు. రైతులు సాగులో ఉండగానే రికార్డులు మార్చడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో వదిలేసిన భూములు ఇప్పుడు తమకే చెందుతాయని అమ్మివేయడం దుర్మార్గమన్నారు. దీనిపై ఎంపీ జీవీఎల్ మాట్లాడుతూ ముందుగా తాను రెవెన్యూ రికార్డులు పూర్తిగా పరిశీలించి కలెక్టర్‌తో మాట్లాడుతానన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే పైస్థాయిలో భూ సమస్య పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు, ఉప్పాడ అప్పారావు, మహంతి అప్పలరమణ, ప్రసాదరావు పట్నాయక్, రూపాకుల రవికుమార్, కాళ్ల కాసులు, అల్లు రాము, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సారిక ప్రకాశరావు, గెద్ద అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం, రేవిడి పంచాయతీ రెడ్డివారి కళ్లాల్లోని జగనన్న లే అవుట్‌లను ఎంపీ జీవీఎల్ నరసింహారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 400 ఎకరాల్లో ప్రభుత్వం భూ సేకరణ జరిపినప్పుడు సాగు రైతులను తప్పించి బినామీల పేర్లు నమోదు చేసినట్టు ఆయన ఆరోపించారు. ఆయనవెంట మండల బీజేపీ నాయకులు ఉన్నారు.

ఆకెళ్ల కుటుంబ సభ్యులకు పరామర్శ



ఆకెళ్ల నరసింహమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్నస్వామి

తగరపువలస: ఇటీవల మృతి చెందిన చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ప్రధాన అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి కుటుంబాన్ని విజయనగరం జిల్లా శ్రీదుర్గా మహాపీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ గురుస్వామిగా ఆకెళ్లగా చేసిన అయ్యప్పస్వామి పూజలు, ఆలపించిన పాటలు తనకు ఎంతో ఇష్టమన్నారు. అనాయాసేన మరణం భగవంతుడు ఆయనకు ఇచ్చిన వరమన్నారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ భీమిలి అధ్యక్షుడు గాడు శ్రీను ఉన్నారు. ఆకెళ్ల కుటుంబానికి రక్షణగా ఉంటామని హామీ ఇచ్చారు.

5 నుంచి బబ్బేలమ్మ పండగ



మధురవాడ: కార్‌షెడ్ కూడలిలో కొలువైన బబ్బేలమ్మ ఊరీ పండగ జూన్ 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నారు. పాత పీఎంపాలెం, పిలకవానిపాలెం, మిథిలాపురి వుడా కాలనీతో పాటు మధురవాడలోని పలు ప్రాంతాల ఆరాధ్య దేవత బబ్బేలమ్మ పండగ 9 ఏళ్ల తర్వాత నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే కరోనా, ఇతర కారణాల వల్ల 12 ఏళ్ల తర్వాత పండగ నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు చెప్పారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నిరుపేదలకు సోలార్ విద్యుత్ సదుపాయం



సోలార్ ప్యానల్, లైటు, ఫ్యాన్ అందిస్తున్న పీపుల్ పవర్ సభ్యులు

భీమునిపట్నం: స్థానిక అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సభ్యులు విద్యుత్ లేని నిరుపేదల ఇళ్లకు ఆదివారం సోలార్ విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. వీరు హ్యాబిట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా సహకారంతో రాయపాలెం, కృష్ణాకాలనీ, ఎగువపేట, మామిడిపాలెం ప్రాంతాల్లో బుధవారం ఆరు ఇళ్లతో పాటు, ఆరు గుడిసెలకు ఒక సోలార్ ప్యానల్, ఫ్యాను, బల్బు అందించారు.

ఈ సందర్భంగా పీపుల్స్ పవర్ ప్రతినిధి నిమ్మకాయల భాస్కర్ మాట్లాడుతూ చిన్న గుడిసెల్లో విద్యుత్ లేకుండా నివసిస్తున్న నిరుపేదలకు వీటిని అందించామని తెలిపారు. ఇదేకాకుండా ఇటువంటి కుటుంబాలకు తమ వంతు ఇతర సహాయ, సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. సభ్యులు జీవన్ కార్తిక్, సునీల్‌రెడ్డి, హర్ష, శ్రావణ్, సత్య పాల్గొన్నారు.

31న లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

భీమునిపట్నం: భీమిలి సౌమ్యగిరిపైనున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 31న సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ



పాలవలసలో అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ రఘురామ్

ఆనందపురం : ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చని ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐ రఘురామ్ సూచించారు. మండలంలోని పాలవలసలో స్థానికులకు బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రఘురామ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపినా, లైసెన్స్ లేకపోయినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుపై నడిచేటప్పుడు జీబ్రా లైన్లు వెంటే వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక యువత, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీతో డాక్టర్ వైఎస్సార్ పశుబీమా



రేవిడిలో పాడి రైతులకు అవగాహన కలిగిస్తున్న డాక్టర్ కరుణాకరరావు

పద్మనాభం: త్వరలో ప్రారంభం కానున్న డాక్టర వైఎస్సార్ పశుబీమా పథకంపై అవగాహన కల్పించేందుకు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్.కరుణాకరరావు మండలంలోని రేవిడి, పాండ్రంగి పంచాయతీల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పాండ్రంగి పశువైద్యురాలు ఆర్.అనుపమతో కలిసి పాడిరైతులకు అవగాహన కలిగించారు. కనీసం ఒకసారి ఈనిన 2 నుంచి 10 ఏళ్ల వయసు గల ఆవులు, 3 నుంచి 12 ఏళ్ల వయసు కలిగిన గేదెలు, దుక్క పశువులలో 1.5 సంవత్సరాల నుంచి 2 ఏళ్ల వయసు కలిగిన విదేశీ జాతులు, 2 నుంచి 10 ఏళ్ల వయసు కలిగిన స్వదేశీ సంకరజాతి పశువులు, ఆరు మాసాలు పైబడిన గొర్రెలు, మేకలు ఈ బీమాకు అర్హులన్నారు.

దేశవాలీ ఆవులు, గేదెలు, దుక్క పశువులకు బీమా కోసం తెల్లరేషన్ కార్డులు కలిగిన రైతులు, ఎస్సీ, ఎస్టీలు రూ.192 ప్రీమియం చెల్లించాలి. సంకరజాతి, మేలుజాతి ఆవులు, గేదెలకు తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్న రైతులు, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల వారు రూ.384 చెల్లించాలి.

పొత్తులతో వచ్చినా టీడీపీ చిత్తే



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రానున్న ఎన్నికల్లో టీడీపీ పొత్తులతో వచ్చినా చిత్తు చిత్తు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు జీవీ అగ్రహారం, బోరపేట, కొత్తవలస ప్రాంతాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మరోవైపు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నిత్యం ప్రజల కోసం ఆలోచించే ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించడం మన అదృష్టమన్నారు. సీఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. అటువంటి అభూత కల్పనలు, ఆరోపణలు నమ్మవద్దని, ప్రజల సంక్షేమం కోసం పని చేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా విధానం వల్ల ప్రజల్లోకి ఎక్కడికి వెళ్లినా విశేష స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సీఎం జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎంగా జగన్ కీర్తికెక్కారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, తహసీల్దార్ వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ 4వ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, వ్యవసాయశాఖ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, స్థానిక నాయకులు బోర రామకృష్ణ, మేరుగు చిన్నారావు, బాగం సుధాకర్, బాడిద బోయిన రాములప్పడు, ఎరుసు అప్పలకొండ రెడ్డి, అప్పలరాజు, నాగోతి సింగన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ సామర్థ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న దత్తాత్రి సలగమే

ఆనందపురం : మారుతున్న కాలానుగుణంగా నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవాలని బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ సీఈవో దత్తాత్రి సలగమే సూచించారు. మండలంలోని గంభీరంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఎంఎంఐ)లో కొత్తగా ప్రారంభించిన ఈఎంబీఏ కోర్సులో చేరిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన బుధవారం మాట్లాడారు. కాలానుగుణంగా వస్తున్న భౌగోళిక, రాజకీయ, సాంకేతిక, శ్రామిక శక్తి తదితర మార్పులపై దృష్టి సారించాలన్నారు. నాయకత్వం వహించడానికి అవసరమైన సామర్థ్యాలు, నాయకత్వ విధానం, భాగస్వామ్య విలువలు, బహుళ నాయకత్వంపై వివరించారు. పరిశ్రమలు వేగవంతమైన మార్పులకు గురవుతున్నాయని, బాష్ సంస్థ పారిశ్రామిక దిగ్గజం స్థాయి నుంచి టెక్నాలజీ మేజర్‌గా ఎలా రూపాంతరం చెందిందో వివరించారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పనిచేసే నిపుణులకు ఉన్నతమైన మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ సంస్థ ప్రభుత్వ - కార్పొరేట్ సంబంధాల అధికారి వీరారెడ్డి ద్వారంపూడి, మొబిలిటీ సొల్యూషన్స్ మేనేజర్ మనోజ్ ఎక్కుండి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ హ్యాపీ పాల్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ చైర్‌పర్సన్ ప్రీతివిర్ధి పాల్గొన్నారు.

28న 'ఘంటసాల జీవిత చరిత్ర' నాటకం

డాబాగార్డెన్స్: భారతదేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శ్రీభాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో ఆ రోజు సాయంత్రం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ నాట కం ప్రదర్శించనున్నట్టు చెప్పారు.

సాయంత్రం 5 గంటలకు, రాత్రి 7.30 గంటలకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని, ప్రదర్శనలకు రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు కళాభారతిలోనూ, రంగ సాయి నాటక గ్రంథా లయం, సాయి బాదంగీర్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కు 94404 58458 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట: జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, భీమ్ నగర్ అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. అల్లిపురం ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవిలో సాధ్యమైనంత త్వరగా ఉదయాన్నే వ్యాక్సినేషన్ అయ్యేటట్లు ప్రణాళిక వేసుకోవాలని ఆయన సూచించారు. యూపీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ పథకాల మీద సర్వే, గర్భిణులను గుర్తించి టి.టి. అందజేయాలని, బర్త్ ప్లానింగ్ గురించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి అందరికీ తెలియచేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి జగదీశ్వరరావు సూచనలిచ్చారు. భీమ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి, కోరాడ, సామియ్యవలస ఫీడర్ల పరిధిలో విద్యుత్ స్తంబాల మార్పు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా పాండ్రంగి, మునివానిపేట, బుడ్డివలస, బొత్సపేట, సామియ్యవలస, అయినాడ, లింగన్నపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ ఎ.జగన్‌మోహనరావు తెలిపారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధువారడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ ఎస్.వి.ఎస్.రామమూర్తి తెలిపారు. మధురవాడ మెయిన్‌రోడ్డు, భగవాన్ దాస్ కాలనీ, ఎం.ఎస్.ఆర్.లే అవుట్, సాయిప్రియా లే అవుట్, చంద్రంపాలెం, భాస్కరనగర్, సంపత్‌నగర్, ఉజ్వల్ ఆస్పత్రి ఏరియా ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అదే విధంగా కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలో కూడా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మది ఏఈఈ వై.సురేష్‌కుమార్ తెలిపారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాస నగర్, సాయిరామ్‌కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లే అవుట్, అమరావతి కాలనీ, సేవానగర్, సూర్యాపేపర్, ఎస్‌టీబీఎల్, వైభవ్‌నగర్‌కు సరఫరా ఉండదని తెలిపారు.

27న పెయింటింగ్ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'బీచ్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 7 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 15 ఏళ్ల వయసు వారికి వేర్వేరుగా పోటీలు ఉంటా యని వివరించారు. రెండు విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. 81214 81452 లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

31న శివపార్వతుల కల్యాణోత్సవం

పీఎం పాలెం: స్థానిక బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో ఈ నెల 31న శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు మఠం ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ విశేష అభిషేకాలు, అర్చనలు ఉంటాయని సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల కల్యాణం జరుగుతుందని ఆలయ గౌరవ ధర్మాధికారి కగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు.

క్లుప్తంగా

శ్రీసీతారామాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాండ్రంగి గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామియ్యవలసలో శ్రీసీతారామలక్ష్మణ హనుమత్ సమేత ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల శ్రీదుర్గా పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయాల నిర్మాణ ఆవశ్యకతను వినిపించారు. కార్యక్రమంలో పాండ్రంగి పీఏసీఎస్ అధ్యక్షుడు అంజూరి అప్పారావు, మాజీ అధ్యక్షుడు ఆర్.ఎస్.దేవుడుబాబు, మాజీ ఎంపీపీ డి.గోపాలకృష్ణమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నియంత్రణకు మాత్రల పంపిణీ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి మాట్లాడుతూ తమ పాఠశాలలో 220 మంది విద్యార్థుల్లో 21 మంది రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. గతనెల నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షల ద్వారా విద్యార్థులను గుర్తించి మాత్రలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, ఉపాధ్యాయులు డీవీ రమేష్, జి.దుర్గాప్రసాద్, వై.వెంకటేష్, కె.లీలామణి తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ కళాశాలతో అపోలో ఫార్మసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు అందజేసుకుంటున్న ప్రతినిధులు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో ఉన్న విశ్వనాథ ఫార్మసీ కళాశాలతో అపోలో ఫార్మసీ సంస్థ బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల విద్యార్థులకు వివిధ విషయాల్లో అవగాహన కలిగించడం, పరిశోధనల్లో తోడ్పాటు అందించడం, శిక్షణ ఇవ్వడం, ఉద్యోగాలు కల్పించడం, సామాజిక అవగాహన పెంపొందించడం వంటి అంశాలపై అవగాహన కలిగిస్తారు. ఈ మేరకు అపోలో ఫార్మసీ రీజినల్ హెచ్ఆర్ వి.నాగేశ్వరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.నాగమణి, సావిత్రి పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

కొమ్మాది: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ బుధవారం జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పిల్లలకు పలు ఆటలపై శిక్షణ ఇచ్చి, అనంతరం గుడ్లు, బిస్కెట్లు, పండ్ల రసాలు అందజేశారు. ఉప్పలూరి గోపి, వర్మరాజు పాల్గొన్నారు.